క్లుప్తంగా

కొత్త రేషన్ కార్డుల పంపిణీ

ఏలేశ్వరం: స్థానిక 18, 20 వార్డుల్లో నూతనంగా మంజూరైన రేషన్ కార్డులను శనివారం మున్సిపల్ కౌన్సిలర్ యండగండి నాగబాబు, మసిరపు నాగేశ్వరరావు లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కట్టుమర్త రాజు, గెద్దాడ అప్పన్న తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం

గండేపల్లి: మండలంలోని తాళ్లూరు జీయ్యన్న మఠంలో శనివారం అన్నదానం నిర్వహించారు. దాతలు రామకుర్తి మూర్తి, భవానీ కుటుంబ సభ్యుల ఆర్థిక సహాయంతో భక్తులకు అన్నదానం చేసినట్టు జీయర్ శాశ్వత అన్నదాన కమిటీ సభ్యులు తెలిపారు. అధిక సంఖ్యలో భక్తులు శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

హిందూ సంప్రదాయాలను గౌరవించాలి

ఏలేశ్వరం: ప్రతిఒక్కరూ హిందూ సంప్రదాయాలను గౌరవించాలని విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు ఒబిలిశెట్టి శ్రీవెంకటేశ్వరరావు అన్నారు. పట్టణంలో హిందూ పరిషత్ మండల అధ్యక్ష, కార్యదర్శులు అలమండ దుర్గావెంకట ప్రసాద్, కటకం కిరిటీ ఆధ్వర్యంలో శ్రీవెంకటేశ్వరరావును శనివారం సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా హిందువులకు ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. ప్రపంచదేశాలు హిందూ సంప్రదాయాలను గౌరవిస్తున్నాయన్నారు. దేశంలో హిందూ మహిళలు సంప్రదాయాలను కొనసాగించాలని కోరారు. కార్యక్రమంలో హిందూ పరిషత్ జిల్లా సభ్యుడు ఎస్.తిరుపతిరావు, ఉద్దగిరి సోమరాజు, మండలశాఖ ఉపాధ్యక్షుడు తూమురౌతు గురయ్య, కందుల ప్రభాకరరావు పాల్గొన్నారు.

బీసీ సంఘం సంయుక్త కార్యదర్శిగా కొండబాబు



ప్రత్తిపాడు: సీమాంధ్ర బీసీ సంక్షేమ సంఘం నియోజకవర్గ సంయుక్త కార్యదర్శిగా ప్రత్తిపాడు గ్రామానికి చెందిన కట్టమూరి కొండబాబు నియమితులయ్యారు. ఈ మేరకు సీమాంధ్ర బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వుల్లిపాయల శంకరయ్య శనివారం నియామక ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా కొండబాబును ఆ సంఘ నియోజకవర్గ అధ్యక్షుడు గొంప శివకుమార్, గ్రామ ఉప సర్పంచ్ మదినే నూకరాజు, నైదాన రఘు తదితరులు అభినందించారు.

తంటికొండ వెంకన్న ఆలయానికి భక్తుల తాకిడి

గోకవరం: మండలంలోని తంటికొండ గ్రామంలో శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. తెల్లవారుజాము నుంచి అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ అర్చకులు స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మధ్యాహ్నం పంచ హారతులు సమర్పించారు. దేవస్థానం ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం నిర్వహించారు.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి

తుని: సంక్రాంతి పండగ సమయంలో పారిశుధ్యం నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని మున్సిపల్ కమిషనర్ ప్రసాదరాజు సూచించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శానిటేషన్ విభాగం సచివాలయ కార్యదర్శులతో శనివారం ఆయన సమావేశం నిర్వహించారు. పండుగను పురస్కరించుకొని ఇతర ప్రాంతాల నుంచి వేలాది మంది పట్టణానికి వస్తారని, దీంతో వ్యర్థాల ఉత్పత్తి పెరుగుతుందన్నారు. మహిళలకు తడి, పొడి చెత్త వేరు చేయడంపై అవగాహన కల్పించాలని సూచించారు. ప్రజా ఆరోగ్యశాఖ అధికారి శేఖర్, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

గౌరీ సేవా సంఘం అధ్యక్షుడిగా శ్రీను

కోటనందూరు: గౌరీ సేవాసంఘం మండలాధ్యక్షుడిగా ఉల్లూరి శ్రీను ఎన్నికయ్యారు. కోటనందూరులో శనివారం సంఘ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ సభ్యులు నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘ అధ్యక్షుడిగా ఉల్లూరి శ్రీను, ఉపాధ్యక్షుడిగా దాడి శ్రీను, కార్యదర్శిగా దాడి వెంకటరమణ, ఉప కార్యదర్శిగా మళ్ల రాము, ట్రెజరర్‌గా ఆళ్ల గంగాధర్, ఉపట్రెజరర్‌గా ఉల్లూరి అప్పారావు ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గాన్ని సంఘ ప్రతినిధులు అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

కేఓ అగ్రహారంలో 'ఇదేమి ఖర్మ రాష్ట్రానికి'

కోటనందూరు: మండలంలోని కేఓ అగ్రహారంలో శనివారం టీడీపీ నాయకులు ఇదేమి ఖర్మ రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. తుని నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ యనమల కృష్ణుడు ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఎదుర్కొంటున్న సమస్యలపై ఆరా తీశారు. గత మూడున్నర సంవత్సరాల్లో రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి నిలిచిపోయిందన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు గాడి రాజబాబు, పార్టీ నేతలు చిరంజీవి రాజు, లెక్కల భాస్కర్ పాల్గొన్నారు.

అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు

- రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా
- జి.మునలయ్యపేటలో గడపగడపకూ మన ప్రభుత్వం



జి.మునలయ్యపేటలో మహిళలకు ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న మంత్రి దాడిశెటి రాజా

తొండంగి: ప్రభుత్వం అర్హతే ప్రామాణికంగా అన్నివర్గాల ప్రజలకూ సంక్షేమ పథకాలను అందిస్తోందని రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా అన్నారు. మండలంలోని గొల్ల మునలయ్యపేటలో శనివారం ఆయన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు.

ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. గత మూడేళ్లలో ప్రభుత్వ పథకాల రూపంలో ప్రతి కుటుంబానికి చేకూరిన లబ్ధిని వివరించారు. గ్రామస్తులు రోడ్లు, డ్రైన్లు తదితర సమస్యలను మంత్రి దృష్టికి తీసుకురాగా ఆయా సమస్యలను వెంటనే పరిష్కరించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అర్హత ఒక్కటే ప్రామాణికంగా పేద, మధ్యతరగతి వర్గాల ప్రజలకు నవరత్నాలతో పాటు సంక్షేమ పథకాలను అందిస్తున్నారన్నారు. రాష్ట్రాభివృద్ధి, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తున్న ప్రభుత్వానికి ప్రజలు అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో తుని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మాకినీడి బాబు, ఎంపీపీ అంగుళూరి అరుణ్‌కుమార్, వైస్ ఎంపీపీ నాగం గంగబాబు, పార్టీ మత్స్యకార విభాగం తుని నియోజకవర్గ కన్వీనర్ మేరుగు ఆనందహరి, పార్టీ నాయకులు గాబు రాజు, దూలం బాబూరావు, దూలం నూకరాజు, అంబుజాలపు గంగరాజు, నేమాల సత్తిబాబు, యాదాల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు



ఎస్.అన్నవరంలో ప్రసన్న వేంకటేశ్వరస్వామిని దర్శించుకుంటున్న మంత్రి దాడిశెట్టి రాజా



ఏలేశ్వరంలో వేంకటేశ్వరస్వామి ఆలయంలో పారాయణ చేస్తున్న మహిళలు

తుని రూరల్: ఎస్.అన్నవరంలో వేంచేసిన శ్రీదేవి భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా స్వామివారిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం ఆలయం వద్ద అన్నసమారాధన నిర్వహించారు. మంత్రి రాజా అన్నదానంలో పాల్గొని భక్తులకు వడ్డన చేశారు. వేలాది మంది భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు. వైస్ ఎంపీపీ చోడిశెట్టి సత్య నాగేశ్వరరావు, దేవస్థానం చైర్మన్ భీమేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు సకురు నాగేంద్ర నెహ్రూ, కుసనం దొరబాబు, కీర్తి రాఘవ భక్తులకు సేవలందించారు.

పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు

ఏలేశ్వరం: స్థానిక వేంకటేశ్వరాస్వామి ఆలయం(బాలాజీచౌక్)లో శనివారం పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. ధనుర్మాసాన్ని పురస్కరించుకుని ఆలయం వద్ద విశ్వహిందూ పరిషత్ అనుబంధ మహిళా సంఘ సభ్యులు విష్ణుసహస్ర నామపారాయణ, లలితాసహస్ర నామపారాయణ, గోవింద నామాలు, భజనలు చేశారు. అనంతరం ఆలయ అర్చకుడు నూకల సుబ్రమణ్యం, హరిదాసులను సన్మానించారు. ఆలయ ధర్మకర్త గోపు వెంకట్రావు, విశ్వహిందూ పరిషత్ మండల కార్యదర్శి కటకం కిరిటీ, జిల్లా ప్రతినిధి నడిశెట్టి తిరుపతిరావు, తూమురౌతు గురయ్య, కందుల ప్రభాకర్ పాల్గొన్నారు.

గోదాదేవికి సారె, చీర సమర్పణ



జగ్గంపేట రాజగోపాలస్వామి ఆలయంలో గోదాదేవికి సారె, చీర సమర్పించిన భక్తులు

జగ్గంపేట: ధనుర్మాసాన్ని పురస్కరించుకుని స్థానిక రుక్మిణీసత్యభామ సమేత రాజగోపాలస్వామి ఆలయంలో గోదాదేవికి శనివారం సారె, చీర సమర్పించారు. తొలుత ఆర్యవైశ్య మహిళా సంఘం ఆధ్వర్యంలో గోదాదేవికి సమర్పించే సారెను మేళతాళాలు, కోలాట నృత్యాల నడుమ గ్రామంలో ఊరేగించారు. అనంతరం ఆలయానికి చేరుకుని అమ్మవారికి సారె సమర్పించారు. సోమవారం అమ్మవారికి భోగిపళ్లు సమర్పిస్తామని, ఈ నెల 14న గోదాకల్యాణం నిర్వహిస్తామని ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు కొత్త కొండబాబు తెలిపారు. పారిశ్రామిక వేత్త కొత్త భైరవకృష్ణ, కంచర్ల బాబు, బొండాడ రాజేష్, మానేపల్లి బంగార్రాజు, ఆర్యవైశ్య మహిళా సంఘం, వాసవీ క్లబ్, వనిత క్లబ్ మహిళలు పాల్గొన్నారు.

యువతను ప్రోత్సహించేందుకే క్రీడా పోటీలు



జగ్గంపేటలో వాలీబాల్ పోటీల విజేతలకు ట్రోఫీ అందజేస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు



కోటనందూరులో క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న ఎంపీపీ శ్రీనివాసు, సీఐ సన్యాసిరావు

ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు

జగ్గంపేట: గ్రామీణ యువతను ప్రోత్సహించేందుకే పోలీసు శాఖ ఆధ్వర్యంలో సంప్రదాయ సంక్రాంతి క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్టు ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు తెలిపారు.

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కాలేజి ఆవరణలో పోలీసుల ఆధ్వర్యంలో శనివారం రాత్రి నిర్వహించిన సంక్రాంతి క్రీడా పోటీల ముగింపు వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. వాలీబాల్, ముగ్గుల పోటీల విజేతలకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. జిల్లాస్థాయి వాలీబాల్ పోటీల్లో 25 టీమ్‌లు పాల్గొనగా కాకినాడ ఐడియల్ కాలేజీ జట్టు ప్రథమ స్థానం, రాజానగరం మండల జట్టు ద్వితీయ, ఏలేశ్వరం మండల జట్టు తృతీయ స్థానాలను కైవసం చేసుకున్నట్టు జగ్గంపేట ఎస్సై రఘునాథరావు తెలిపారు. కార్యక్రమంలో సీఐ సూర్య అప్పారావు, జగ్గంపేట ఎంపీపీ అత్తులూరి నాగబాబు, రాష్ట్ర వైఎస్సార్ సీపీ సేవాదళ్ కార్యదర్శి ఒమ్మి రఘురాం, రాష్ట్ర సీడ్ కార్పొరేషన్ డైరెక్టర్ అప్పారావు కాపు, జగ్గంపేట గ్రామ ఉపసర్పంచ్ బండారు రాజా, డిగ్రీ కాలేజి ప్రిన్సిపాల్ చంద్రనాయుడు, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా సంక్రాంతి క్రీడా సంబరాలు

కోటనందూరు: స్థానిక మదర్ విద్యాసంస్థల ఆవరణలో పోలీసుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సంక్రాంతి క్రీడా సంబరాలను ఎంపీపీ లగుడు శ్రీనివాసు, తుని రూరల్ సీఐ సన్యాసిరావు శనివారం ప్రారంభించారు. కొంత సమయం వారు ఆటలాడి క్రీడాకారులను ఉత్తేజ పరిచారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ సంక్రాంతికి పోలీసు శాఖ ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. సీఐ సన్యాసిరావు మాట్లాడుతూ ప్రజలెవరూ జూదాల జోలికి పోకుండా కుటుంబ సభ్యులతో సంక్రాంతిని ఆనందంగా జరుపుకోవాలని సూచించారు. సొసైటీ అధ్యక్షుడు గొర్లి రామచంద్రరావు, వ్యవసాయ సలహా మండలి మండలాధ్యక్షుడు సుర్ల రాజు, కో ఆప్షన్ సభ్యుడు జిగటాల కోటసత్తిబాబు, ఎస్సై స్వామినాయుడు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

తొండంగి: సంక్రాంతిని పురస్కరించుకుని పెరుమాళ్లపురం పంచాయతీ తలపంటిపేటలో శనివారం జిల్లాస్థాయి క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభమైంది. అరబిందో ఇన్‌ఫ్రా, కాకినాడ సెజ్ సంస్థల ఆర్థిక సాయంతో ఏర్పాటు చేసిన ఈ టోర్నమెంట్‌ను పెరుమాళ్లపురం సర్పంచ్ యాదాల ఉమారేవతి, వైఎస్సార్ సీపీ నాయకుడు యాదాల రాజబాబు ప్రారంభించారు. ఈ టోర్నీలో తుని, పిఠాపురం, శంఖవరం నియోజకవర్గాలకు చెందిన 80 క్రికెట్ టీమ్‌లు పాల్గొంటాయని నిర్వాహకులు తెలిపారు. విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటు ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్, ప్రతీ మ్యాచ్‌కు బెస్ట్ ప్లేయర్ అవార్డులు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో తలపంటిపేట యువత, ఉపసర్పంచ్ పెరుమాళ్ల లోవరాజు, ఎంపీటీసీ అంబుజాలపు అప్పలరాజు, అరబిందో ఫార్మా ఫౌండేషన్, కేఎస్ఈజెడ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

పాఠశాల ప్రణాళికల తయారీపై అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న హెచ్‌ఎం నారాయణ

కోటనందూరు: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిలో ఆవాస, పాఠశాల ప్రణాళికలు కీలకపాత్ర పోషిస్తాయని కాంప్లెక్స్ హెచ్‌ఎం కేఎస్‌వీఎస్ నారాయణ అన్నారు. పాతకొట్టాం హైస్కూల్లో శనివారం కాంప్లెక్స్ స్థాయిలో ఆవాస, పాఠశాల ప్రణాళికల తయారీపై హెచ్‌ఎంలు, విద్యార్థుల తల్లిదండ్రులు, పీఎంసీ చైర్మన్‌లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం నారాయణ మాట్లాడుతూ ప్రణాళికల తయారీలో ప్రజల భాగస్వామ్యం ఉంటే పాఠశాలలు మరింత అభివృద్ధి పథంలో నడుస్తాయన్నారు. పాఠశాలలు, విద్యార్థుల అభివృద్ధే లక్ష్యంగా ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. బొద్దవరంలో కాంప్లెక్స్ చైర్మన్ వెంకటరమణ ఆధ్వర్యంలో ప్రణాళికల తయరీపై అవగాహన సదస్సు నిర్వహించారు. సీఆర్పీలు పాల్గొన్నారు.

బీమా చెక్కు అందజేత

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని వేములపాలెం గ్రామానికి చెందిన తుట్టా రాంబాబు అనారోగ్యంతో ఇటీవల మృతి చెందాడు. అతనికి వైఎస్సార్ బీమా పథకంలో రూ.లక్ష మంజూరు కాగా మృతుడి కుటుంబ సభ్యులకు శనివారం వైఎస్సార్ సీపీ నాయకుడు చందక నాని బీమా చెక్కు అందజేశారు. పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

గ్రామ సభ

జగ్గంపేట: గ్రామాలు అభివృద్ధి చేందాలంటే పంచాయతీల్లో గ్రామ సభల నిర్వహణ సక్రమంగా సాగాలని రాష్ట్ర వైఎస్సార్ సీపీ సేవాదళ్ కార్యదర్శి ఒమ్మి రఘురాం అన్నారు. స్థానిక సచివాలయం-1లో శనివారం సర్పంచ్ బచ్చల నాగరత్నం అధ్యక్షతన గ్రామ సభ నిర్వహించారు. గ్రామంలో జరుగుతున్న అభివృద్ధి పనుల ప్రగతిని, త్వరలో చేపట్టే పనులను ఉపసర్పంచి బండారు రాజా వివరించారు. గ్రామాభివృద్ధి ప్రణాళికల తయారీపై ఈఓపీఆర్డీ భారతి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పంచాయతీ మెంబర్లు సత్తి శివారెడ్డి, చిట్టిమాని సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి గణేష్, వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ మహా సభలను జయప్రదం చేయాలి

తుని: బీహార్ రాష్ట్రంలోని పాట్నాలో వచ్చే నెల 15 నుంచి 20 వరకూ జరిగే సీపీఐ ఎంఎల్ లిబరేషన్ 11వ జాతీయ మహా సభలను విజయవంతం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు కె.జనార్ధన్ శనివారం ఓ ప్రకటనలో కోరారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

రౌతులపూడి: విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని ప్రత్తిపాడు సీఐ కిశోర్‌బాబు సూచించారు. స్థానిక విజేత జూనియర్ కళాశాల విద్యార్థులకు శనివారం మాదకద్రవ్యాల వలన కలిగే అనర్థాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. విద్యార్థులు ర్యాగింగ్‌కు పాల్పడకుండా బాధ్యతాయుతంగా ఉండలన్నారు. చట్టాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, తల్లిదండ్రులకు బాసటగా నిలవాలని సూచించారు. కార్యక్రమంలో అన్నవరం ఎస్‌ఐ శోభన్‌కుమార్, కళాశాల ప్రిన్సిపాల్ ఆదినారాయణ, అధ్యాపకులు పాల్గొన్నారు.

ముగిసిన వెండి తాపడం మహోత్సవాలు

గోకవరం: గ్రామంలో ప్రసిద్ధిగాంచిన దేవీచౌక్ ఆలయంలో గత నాలుగు రోజులుగా జరుగుతున్న వెండి తాపడం మహోత్సవాలు శనివారంతో ముగిశాయి. అమ్మవారి అంతరాలయాన్ని రూ.30 లక్షల విలువైన 50 కేజీల వెండితో తాపడం చేశారు. ఈ వెండి తాపడం మహోత్సవాన్ని పురస్కరించుకుని చివరి రోజు హైదరాబాద్‌కు చెందిన కంబాల శ్రీనివాస్‌రావు, గోకవరానికి చెందిన కంచర్ల సూర్యప్రకాష్ పులిహోర, చక్రపొంగలి ప్రసాదాన్ని వితరణ చేశారు. తొలుత ఆలయంలో అమ్మవారికి అర్చకులు వల్లూరి జగన్నాథశర్మ, శ్రీనివాస్‌శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

భూ సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలి



సమగ్ర భూ సర్వేపై సిబ్బందికి సూచనలిస్తున్న ఆర్డీఓ చైత్రవర్షిణి

గోకవరం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర భూ సర్వేను సక్రమంగా త్వరితగతిన పూర్తిచేయాలని రాజమహేంద్రవరం ఆర్డీఓ చైత్రవర్షిణి సూచించారు. మండలంలోని రంపయర్రంపాలెం పంచాయతీ పరిధిలో జరుగుతున్న భూ సర్వేను శనివారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. సర్వే తీరును పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, భూ సర్వే డిప్యూటీ తహసీల్దార్ రజని, ఇతర రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యం

శంఖవరం: పరిశుభ్రతకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని జి.కొత్తపల్లి సర్పంచ్ ఈగల విజయదుర్గ అన్నారు. మండలంలోని జి.కొత్తపల్లిలో శనివారం ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్ నిర్వహించారు. సర్పంచ్ ఆధ్వర్యంలో పంచాయతీ సిబ్బంది డ్రైన్లలో పూడికతీసి శుభ్రం చేశారు. రోడ్లకు ఇరువైపులా బ్లీచింగ్ చల్లారు. వీధుల్లో దోమల నివారణ మందు పిచికారీ చేశారు. మహిళలు ఇళ్లలోని వ్యర్థాలను తడి, పొడి చెత్తలుగా వేరు చేసి పారిశుధ్య సిబ్బందికి అందజేయాలని సర్పంచ్ కోరారు.

మార్పులకు అనుగుణంగా పని చేయాలి

జిల్లా ఎస్పీ రవీంద్రనాథ్‌బాబు



తునిలో శిక్షణ తీసుకుంటున్న అభ్యర్థులకు సూచనలిస్తున్న ఎస్పీ రవీంద్రనాథ్‌బాబు

తుని: ప్రస్తుత సమాజంలో పోలీసుల విధి నిర్వహణలో పలు మార్పులు చోటుచేసుకున్నాయని, వాటికి అనుగుణంగా నడుచుకోవాలని జిల్లా ఎస్పీ ఎం.రవీంద్రనాథ్‌బాబు అన్నారు. తునిలో మంత్రి దాడిశెట్టి రాజా సౌజన్యంతో ఎస్‌ఐ, కానిస్టేబుల్ అభ్యర్థులకు ఉచితంగా అందిస్తున్న శిక్షణ శిబిరాన్ని శనివారం సాయంత్రం ఆయన సందర్శించారు. విశాఖపట్నం సిద్ధి సంస్థ ద్వారా శిక్షణ తీసుకుంటున్న అభ్యర్థులతో ముచ్చటించారు. సంఘంలో ఎవరికీ దక్కని గౌరవం, మర్యాద, సమాజ బాధ్యత, రక్షణ పోలీసులకే దక్కుతుందన్నారు. శ్రద్ధ, పట్టుదలతో లక్ష్యానికి చేరువ కావాలన్నారు. మహిళలు పోలీస్ శాఖలోకి రావడానికి మక్కువ చూపడం శుభ పరిణామన్నారు. యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్న ధృఢ సంకల్పంతో మంత్రి దాడిశెట్టి రాజా ఎస్‌ఐ, కానిస్టేబుల్ అభ్యర్థులకు ఉచిత శిక్షణ ఇప్పించడం అభినందనీయమన్నారు. అభ్యర్థులు శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. తుని పట్టణ సీఐ నాగ దుర్గారావు పాల్గొన్నారు.

సంప్రదాయ క్రీడలకు అనుమతి

సంక్రాంతి పండగను పురస్కరించుకొని సాంప్రదాయ క్రీడలు, కార్యక్రమాలకు అనుమతి ఇస్తామని ఎస్పీ రవీంద్రనాథ్‌బాబు తెలిపారు. ప్రజలు ప్రశాంత వాతావరణంలో పండగను జరుపుకోవాలని సూచించారు. అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

గ్రామ పంచాయతీల అభివృద్ధికి కృషి



భూపాలపట్నంలో అల్లు విజయ్‌కుమార్‌ను, యల్లపు నానాజీలను సన్మానిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

కిర్లంపూడి: గ్రామ పంచాయతీల అభివృద్ధికి కృషి చేస్తానని సర్పంచుల సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అల్లు విజయ్ కుమార్ అన్నారు. మండలంలోని భూపాలపట్నంలో ఇటీవల రాష్ట్ర సర్పంచుల సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శిగా నియమితులైన అల్లు విజయ్ కుమార్, మండల సచివాలయాల కన్వీనర్‌గా నియమితులైన యల్లపు నానాజీలను శనివారం ఎంపీపీ తోట రవి అధ్యక్షతన పూలమాల, శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో భూపాలపట్నం ప్రసాద్, మార్కెట్ కమిటీ చైర్మన్ జనపురెడ్డి బాబు, కిర్లంపూడి సొసైటీ చైర్మన్ చదలవాడ బాబి, వైఎంఎస్‌సీ చైర్మన్ పెంటకోట నాగబాబు, వైస్ ఎంపీపీ బొడ్డేటి గణపతి, అరబోలు వాసు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు దుస్తుల పంపిణీ



ప్రత్తిపాడులో పేద విద్యార్థులకు దుస్తులు అందజేస్తున్న పడాల శ్రీనివాసరెడ్డి దంపతులు

ప్రత్తిపాడు: స్థానిక సదా మీ సేవలో (ఎస్ఎంఎస్) స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో శనివారం పేద విద్యార్థులు, వారి తల్లులకు సంక్రాంతి కానుకలు పంపిణీ చేశారు. స్థానిక బజారు వీధి రామాలయ ఆవరణలో శ్రీషిర్డీసాయి జ్యూయలరీస్ అధినేత పడాల శ్రీనివాసరెడ్డి, గీతావాణి దంపతులు పేద విద్యార్థులకు పౌష్టికాహార కిట్లతో పాటు దుస్తులు, వారి తల్లులకు చీరలను అందజేశారు. ఈ సందర్భంగా దాత శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ పేద విద్యార్థులకు ఎస్ఎంఎస్ సంస్థ ద్వారా అందిస్తున్న సేవలు అమూల్యమైనవన్నారు. విద్యార్థుల సేవలో తాను భాగస్వామి కావడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఎస్ఎంఎస్ ప్రతినిధులు గొందేసి సత్యానందం, ఎస్వీ సోమేశ్వరరావు, శిరసాల మణికంట జ్యోతి, లక్ష్మి తదితులు పాల్గొన్నారు.

బాధిత రైతుకు ఆర్థిక సాయం అందజేత



రైతుకు ఆర్థిక సాయం అందిస్తున్న వ్యవసాయ సలహా మండలి చైర్మన్ రాంబాబురాజు

తుని రూరల్: మండలంలోని తేటగుంట గ్రామానికి చెందిన ఇంజరపు సూర్య మాణిక్యాలరావు (తాతాజీ) పొలంలో శుక్రవారం రాత్రి అగ్ని ప్రమాదం సంభవించి ఎకరా 80 సెంట్లలో పండించిన వరి కుప్ప దగ్ధమైంది. బీమా సంస్థ నుంచి పరిహారం రాదన్న విషయం తెలియడంతో బాధితుడికి రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా రూ.10 వేలు, వ్యసాయశాఖ సిబ్బంది రూ.10 వేలు ఆర్థిక సాయం ప్రకటించారు. ఆ మొత్తాన్ని బాధితుడికి మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ చోడ్రాజు రాంబాబురాజు, సర్పంచ్ అత్తి నాగరాజు, ఏఓ అశోక్ కుమార్ అందజేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు బుజ్జిబాబు రాజు, గణేషుల వీరబాబు, పప్పు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మహిళా ఉపాధ్యాయులకు సత్కారం



జగ్గంపేటలో మహిళా ఉపాధ్యాయిలను సత్కరించిన యూటీఎఫ్ నాయకులు

జగ్గంపేట: సావిత్రీబాయి పూలే ఆశయాలను మహిళా ఉపాధ్యాయులు ఆదర్శంగా తీసుకోవాలని ఎంఈఓ ఆర్.స్వామి సూచించారు. స్థానిక యూటీఎఫ్ భవనంలో శనివారం సావిత్రీబాయి పూలే జయంతి వేడుకలు నిర్వహించారు. జిల్లా కుటుంబ సంక్షేమ పథకం డైరెక్టర్ పీవీ సత్యనారాయణ సావిత్రీ పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆమె సేవలను కొనియాడారు. అనంతరం మండల యూటీఎఫ్ శాఖ ఆధ్వర్యంలో ఏడుగురు మహిళా ఉపాధ్యాయులను సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ మండల శాఖ అధ్యక్షుడు జి.వెంకటేశ్వరరావు, అసోసియేట్ అధ్యక్షురాలు బి.దుర్గాభవాని, పాల్గొన్నారు.

కిర్లంపూడి: ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఆధ్వర్యంలో స్థానిక మెయిన్ పాఠశాలలో శనివారం సావిత్రీబాయి పూలే జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ టి.జోసెఫ్ మహిళా ఉపాధ్యాయులు ఎ.ధనలక్ష్మి, సీహెచ్ లక్ష్మి, ఎస్కే నీరజ, ఎం.దేవి, పీలా నాగలక్ష్మిలను సత్కరించారు. యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి బాలిన నూకరాజు, సావిత్రి, జ్యోతి పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నవధాన్యాల సాగుతో బహుళ ప్రయోజనాలు

తుని రూరల్: నవధాన్యాల సాగుతో బహుళ ప్రయోజనాలు కలుగుతాయని మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ చోడ్రాజు రాంబాబురాజు అన్నారు. మండలంలోని తేటగుంటలో శనివారం ఏఓ బి.అశోక్ కుమార్ ఆధ్వర్యంలో ప్రకృతి సేద్యం, డాక్టర్ వైఎస్సార్ పొలంబడి క్షేత్ర దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవధాన్యాల సాగుతో భూసారం పెరుగుతుందన్నారు. పంటమార్పిడి, ప్రకృతి వ్యవసాయంతో తెగుళ్లను అదుపు చేయవచ్చన్నారు. రైతులు ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈఓ పి.జగ్గప్పారావు, వీఏఏలు, జెడ్‌బీఎన్ఎఫ్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

నిబంధనలకు లోబడి ధాన్యం కొనుగోలు చేయాలి

రౌతులపూడి: మిల్లర్లు ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ధాన్యం కొనుగోలు చేయాలని రైతులు డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక రైతు భరోసా కేంద్రం వద్ద రైతులు శనివారం ఆందోళన చేశారు. మిల్లర్లు ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలకు అనుగుణంగా ధాన్యం కొనుగోలు చేపట్టడం లేదన్నారు. నూక, తేమశాతాన్ని ఆసరాగా తీసుకుని అధికంగా తరుగు తీసుకుంటున్నారని ఆరోపించారు. దీనిపై ఏఓ ఈశ్వరరావును వివరణ కోరగా ప్రభుత్వం మార్గదర్శకాల ప్రకారమే నూక, తేమశాతాన్ని గుర్తించి ధాన్యం కొనుగోలు చేస్తున్నట్టు చెప్పారు. మిల్లర్లు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని రైతులకు హామీ ఇచ్చారు.